



# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

బుధవారం, ఆగస్టు 27, 2025

సంపుటి : 10 సంచిక :14 రంగారెడ్డి ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ పేజీలు 8 వెల 4/-


## బీహార్‌లో రాహుల్ ఓటర్ అధికార యాత్ర

### పాల్గొన్న సిఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు





## గవర్నర్లకు విచక్షణాధికారం

### ఆర్థిక బిల్లులును కూడా అడ్డుకోవచ్చు

### ఇది సమస్యాత్మ అంశమని సుప్రీం అభిప్రాయం

న్యూఢిల్లీ, ఆగస్ట్26 : గవర్నర్ అధికారాలపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఆర్టికల్ 200 ప్రకారం బిల్లులను ఆపే అధికారం గవర్నర్‌కు ఉంటే.. మనీ బిల్లులను ఆపే అధికారం కూడా గవర్నర్‌కు ఉంటుందని అత్యున్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. ఈ అంశం

(మిగతా 2వ పేజీలో)

## యూరియా కోసం రైతులు ధర్నాలు చేస్తుంటే.. సిఎం, మంత్రులు ఎక్కడ?: కెటిఆర్





పాఠకులకు,

శ్రేయోభిలాషులకు

**వినాయక చవితి శుభాకాంక్షలు**

వినాయక చవితి సందర్భంగా 27-8-2025న పత్రిక కార్యాలయానికి సెలవు.

కావున 28-8-2025 గురువారం సంచిక వెలువడదు.

పునర్దర్శనం శుక్రవారం

## భారత ఎగుమతులపై 50% సుంకాలు

### నేటి నుంచే అమల్లోకి రానున్న ట్రంప్ ఆదేశాలు

### సవాళ్లకు సిద్ధంగా ఉన్నామన్న ఆర్‌బిఐ



వాషింగ్టన్,ఆగస్ట్26 : భారతీయ ఎగుమతులపై 50 శాతం సుంకాలు బుధవారం నుంచి అమల్లోకి రానున్నాయి. ఇప్పటికే 25 శాతం సుంకాలు విధించిన ట్రంప్ సర్కార్.. రష్యా చమురు కొనుగోళ్లను సాకుగా చూపి భారత్‌పై మరో 25 శాతం టారీఫ్‌లు విధించిన విషయం తెలిసిందే. ఆగస్టు 6న ఈ ఎగ్జిటీవ్ ఆర్డర్‌పై 14329పై సంతకం చేసిన ట్రంప్..ఈ నెల 27 నుంచి 50 శాతం టారీఫ్‌లు అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు. దీంతో తాజాగా 25 అదనపు సుంకాలపై అమెరికా అధికారికంగా బహిరంగ నోటీసులు జారీ చేసింది. భారత్ నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై కొత్త సుంకాలు ఆగస్టు 27 తెల్లవారుజాము 12.01 గంటల నుంచే అమల్లోకి వస్తాయని యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ ద్వారా హోమ్‌లాండ్ ఆఫ్ సెక్యూరిటీ– విడుదల చేసిన నోటీసుల్లో పేర్కొంది. ఇదిలావుంటే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై విధించిన అధిక సుంకాల్లో మొత్తం ఎగుమతిదారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతుంటే..

(మిగతా 2వ పేజీలో)

## నేడు ఖైరతాబాద్ వినాయకుడికి ప్రాణప్రతిష్ట



హైదరాబాద్,ఆగస్ట్26 : గణేశ్ ఉత్సవాల్లో ఖైరతాబాద్ గణేశుడికి ఏటా ఆదరన పెరుగుతోంది. ప్రతిరోజూ లక్ష నుంచి రెండు లక్షల మంది భక్తులు ఖైరతాబాద్ గణపతి వద్దకు వస్తుంటారు. ఇక వారాంతపు రోజులైన శని, ఆదివారాల్లో ఈ సంఖ్య 3 నుంచి 5 లక్షల వరకు ఉంటుంది. ఈసారి ఇంతకు మించి భక్తులు వస్తారనే అంచనాల నేపథ్యంలో ఖైరతాబాద్ గణపతి వద్ద పోలీసులు ఎప్పుడూ లేనంత బందోబస్తును నిర్వహించనున్నారు. ఈ విషయమై సైఫాబాద్ ఏసీపీ ఆర్. సంజయ్‌కుమార్ వివరాలను మీడియా ప్రతినిధులకు వెల్లడించారు. ఇక్కడ ఆరుగురు డీఎస్పీలు, 23 మంది ఇన్‌స్పెక్టర్లు, 52 మంది ఎస్‌ఐలు, 150 మంది కానిస్టేబుళ్లు, 50 మంది మహిళా కానిస్టేబుళ్లు, 22 ప్లటూన్ల సిబ్బందిని వినయోగిస్తున్నట్లు– తెలిపారు. ప్రతి రోజూ తరచుగా డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు చేస్తాయని, 60 సీసీ కెమెరాల ద్వారా భక్తుల భద్రతను సమీక్షిస్తామని తెలిపారు. అన్ని మార్గాల్లో

(మిగతా 2వ పేజీలో)



### కాంగ్రెస్ ఇచ్చిన హామీలు

## నిలుపుకోలేక నానా తంటాలు

### ఓట్ చోరీ అంటూ ప్రజలను అవమానిస్తున్న కాంగ్రెస్

### ఓట్ చోరీ జరిగితే బిజెపి 16 సీట్లు గెలిచేది

### మాది నిజంగానే దేవుళ్ల పార్టీ

### పిసిసి చీఫ్ వ్యాఖ్యలకు బండి సంజయ్ కౌంటర్

కరీంనగర్,ఆగస్ట్26 : కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వస్తే.. రాజకీయ సన్యాసం తీసుకుంటానని కాంగ్రెస్ ప్రభుత్వంపై కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ వాగ్దానాలు అమలుకాలేదని, మోసపూరిత హామీలపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, ఆ పార్టీకి

(మిగతా 2వ పేజీలో)

## ఈ నెల 29న కేబినెట్ సమావేశం

### అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో సర్క్యులర్ జారీ

### కాళేశ్వరం కమిషన్ ఇచ్చిన రిపోర్టును ఆమోదం?

### బిసి రిజర్వేషన్లు, సర్పంచ్ ఎన్నికలు తదితర అంశాలపై చర్చ



హైదరాబాద్,ఆగస్ట్26 : సిఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఈ నెల 29వ తేదీన సచివాలయంలోని 6వ అంతస్తులో మధ్యాహ్నం 3 గంటలకు కేబినెట్ సమావేశం జరుగనుంది. అయితే, అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో కేబినెట్ భేటీలో చర్చించాల్సిన పలు అంశాలపై ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ప్రిన్సిపల్ సెక్రటరీలు, ప్రభుత్వ కార్యదర్శులు అజెండా అంశాలను సాధారణ పరిపాలన విభాగానికి (జిఏడి)కి పంపాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సిఎస్ రామకృష్ణ రావు మంగళవారం సర్క్యులర్ జారీ చేశారు. కేబినెట్‌లో ప్రధాన అజెండాగా జస్టిస్ చంద్రఘోష్ ఆధ్వర్యంలోని కాళేశ్వరం కమిషన్ ఇచ్చిన రిపోర్టును

(మిగతా 2వ పేజీలో)



### రూ. 33 కోట్ల చేనేత రుణాలను

## మాఫీ చేస్తాం: మంత్రి తుమ్మల

హైదరాబాద్,ఆగస్ట్26 : దేశానికే తెలంగాణ రాష్ట్రాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు తెలిపారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నిర్వహించిన నేతన్న పొదుపు, బీమా పథకాల పంపిణీ కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, చేనేత జౌళిశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్‌పి మహేష్ బి గితే తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ..నేత కార్మికులకు గడిచిన పదేళ్ల కాలంగా ఉన్న బకాయిలను

(మిగతా 2వ పేజీలో)

# కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నిలుపుకోలేక నానా తంటాలు



మళ్లీ అధికారం కలేనని అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలు ఏమయ్యాయో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ చెప్పాలని బండి సవాల్ చేశారు. మంగళవారం కరీంనగర్‌లో బండి సంజయ్ పర్యటించిన సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడారు. ఓట్ల చోరీ అంటూ కాంగ్రెస్ నేతలు చేస్తున్న ఆరోపణలు అర్ధరహితమని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. 30 ఏళ్లుగా తాను ప్రజాప్రతినిధిగా ఉన్నానని చెప్పారు. వార్డు మెంబర్ కానివాళ్లు కూడా విమర్శించడం సరికాదన్నారు. ఇటీవల టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ చేసిన ఆరోపణల నేపథ్యంలో బండి సంజయ్ స్పందించారు. దొంగ ఓట్లు- అంటూ కాంగ్రెస్ నేతలు చేసే దుష్ప్రచారం ప్రజలను అవమానించడమేనని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంచాయతీలకు ఒక్క పైసా అయినా ఇచ్చిందా? కేంద్రం నిధులు ఇస్తుందనే ఇప్పుడు స్థానిక ఎన్నికలు నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ నేతలు రాత్రిపూట యాత్రలు చేయడం ఏమిటో అర్థం కావడం లేదు. కరీంనగర్‌లో ప్రతి ఓటూ పరిశీలించి దొంగ ఓట్ల తీసేయాలి. రెండు చోట్ల ఓటు- వేయడం ఎవరికైనా సాధ్యమా?అవగాహన లేకుండా ఇష్టారీతిన మాట్లాడుతున్నారు. పీసీసీ అధ్యక్షుడు ఓట్ల చోరీ గురించి కాకుండా సీట్ల చోరీ గురించి మాట్లాడాలి. రొహింగ్యాల విషయంలో ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నారు. దేశం ముఖ్యమా? ఓటు- బ్యాంకు ముఖ్యమా? అప్పుడు భారత రాష్ట్ర సమితి.. ఇప్పుడు కాంగ్రెస్.. రెండూ అదే తరహా రాజకీయాలు చేస్తున్నాయని బండి సంజయ్ విమర్శించారు. ప్రజలను కలవకుండా రాత్రి పూట యాత్రలు ఎందుకు చేస్తున్నారని నిలదీశారు. టీ-పీసీసీ చీఫ్ ఒక గజినీ.. ఆయనను ఎవరైనా గుర్తు పడతారా అని ప్రశ్నించారు. మహేష్ గౌడ్ వార్డు మెంబర్‌గా కూడా గెలిచావా అని బండి సంజయ్ నిలదీశారు. తెలంగాణలో ఓటు- చోరీ జరిగితే.. కాంగ్రెస్ ఎనిమిది ఎంపీ సీట్లు కూడా తామే గెలిచే వాళ్లమని చెప్పుకొచ్చారు. ప్రజల ఓట్లతో మహేష్ గౌడ్ ఒక్కసారైనా గెలవాలని ఛాలెంజ్ చేశారు. కర్ణాటక, తెలంగాణలో మీరెలా గెలిచారని ప్రశ్నించారు. టీపీసీసీ చీఫ్ బీఆర్ఎస్ మనిషి అని షాకింగ్ కామెంట్స్ చేశారు. ఆయనకు సెక్యూరిటీ- కావాలని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఓటు- చోరీ జరిగిందని ప్రజలను మహేష్ గౌడ్ అవమానిస్తున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నేతలే ఓట్ల బిచ్చగాళ్లు అని విమర్శించారు. టోపీలు పెట్టుకుని ఓట్ల కోసం వెళ్లేది కాంగ్రెస్ నేతలే అని ఆక్షేపించారు. రోహింగ్యాలు వచ్చింది కాంగ్రెస్ హయాంలోనేనని బండి సంజయ్ కుమార్ ఆరోపించారు. కేంద్రం నిధుల కోసమే ఇప్పుడు స్థానిక ఎన్నికలు జరుగుతాయని బండిసంజయ్ తెలిపారు. కాంగ్రెస్ పాలనలో పంచాయితీలకు ఒక్క పైసా ఇచ్చిందా? అని ప్రశ్నించారు. 6 గ్యారెంటీలపై ప్రజలు కొట్టేట్లు ఉన్నారని, కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వస్తే రాజకీయ సన్యాసం చేస్తానని సవాల్ విసిరారు. కరీంనగర్ లో ఒక్కో మైనార్టీ ఇంట్లో 200 ఓట్లున్నాయని పేర్కొన్నారు. కర్ణాటక, తెలంగాణ, హిమాచల్ లో అధికారం ఎలా వచ్చిందని బండి ప్రశ్నించారు. ఎన్నికలున్నా.. లేకున్నా హిందూ ధర్మం కోసం నిలబెడతాం అని స్పష్టం చేశారు. భైంసాలో హిందువుల ఇళ్లు తగలబెట్టినప్పుడు వాళ్లెక్కడికి వెళ్లారని నిలదీశారు. తమది దేవుళ్ల పార్టీ అని మీది బిచ్చపు బతుకు అని ఎద్దేవా చేశారు. సనాతన ధర్మం కోసం బిజెపి నిలబడుతుందని, యుపిఎ హయాంలోనే రోహింగ్యాలు దేశంలోకి వచ్చారని తెలిపారు. కరీంనగర్ లో హిందూ ఓటు- ద్వారానే గెలిచానని బండి సంజయ్ స్పష్టం చేశారు.

# బీహార్‌లో రాహుల్ ఓటర్ అధికార యాత్ర




## పాల్గొన్న సిఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు

పాట్నా,ఆగస్ట్26 : బీహార్ లో ఓటర్ అధికార యాత్ర తిరిగి ప్రారంభమైంది. మంగళవారం బీహార్ లోని సుపాల్ లో సాగుతున్న ఓటర్ అధికార్ యాత్రలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీతో కలసి ప్రియాంకగాంధీ, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ- సీఎం మల్లు భట్టి విక్రమార్క సహా పలువురు మంత్రులు ఈ యాత్రలో పాల్గొన్నారు. ఆర్జేడీనేత తేజస్వి యాదవ్, ఇండియా బ్లాక్‌కు చెందిన ఇతర ప్రతినిధులతో పాటు నేతలంతా కారు పైకప్పుపై కూర్చుని ప్రజలకు అభివాదం చేశారు. ఒకరోజు విరామం తీసుకున్న వోట్ అధికార్ యాత్ర మంగళవారం తిరిగి ప్రారంభమైంది. ఆదివారం అరారియాలో జరిగిన విలేకరుల సమావేశంలో రాహుల్ గాంధీమాట్లాడుతూ..బీహార్‌లోని అన్ని భారత కూటమి నియోజకవర్గాలు రాబోయే అసెంబ్లీ ఎన్నికల కోసం ఐక్యంగా పనిచేస్తున్నాయన్నారు. మంచి ఫలితాలుంటాయని చెప్పారు. ప్రతిపక్ష కూటమిలోని అన్ని నియోజకవర్గాలు ఐక్యంగా పనిచేస్తున్నాయి. మేం సైద్ధాంతికంగా,రాజకీయంగా కలుపుకుపోతున్నామన్నారు. పరస్పరం ఒకరినొకరు గౌరవించుకుంటూ పోతున్నామన్నారు. బీహార్ ఎన్నికల సందర్భంగా ఇండియా కూటమి త్వరలో మేనిఫెస్టోను విడుదల చేస్తుందని రాహుల్ గాంధీ అన్నారు.

# రూ. 33 కోట్ల చేనేత రుణాలను మాఫీ చేస్తాం: మంత్రి తుమ్మల



ప్రజా ప్రభుత్వం విడుదల చేస్తుందని అన్నారు. నేత కార్మికుల కోరిక మేరకు లక్ష రూపాయల వరకు రుణమాఫీ చేస్తున్నామని అన్నారు. నేతన్న చేయూత, నేతన్న బీమా వంటి అనేక పథకాల బకాయిలు జమ చేస్తున్నామని అన్నారు. రూ.33 కోట్లు చేనేత రుణాలను రాబోయే క్యాబినెట్ సమావేశంలో ప్రవేశపెట్టి మాఫీ చేయనున్నట్లు ప్రకటించారు.వేములవాడలో నూలు డిపో ఏర్పాటు చేసి ఇప్పటివరకు 2,500 మెట్రిక్ టన్నుల నూలు దారం వంద సొసైటీలకు అందించామని అన్నారు. వస్త్ర పరిశ్రమలో ఆధునిక సాంకేతికతను పెంచేందుకు హ్యాండ్లూమ్ యూనివర్సిటీ, ఐఐహెచ్‌టి ఏర్పాటుకు కృషి చేస్తున్నామని అన్నారు. మహిళలు గౌరవంగా స్వీకరించేలా నాణ్యమైన చీరలు తయారుచేయాలని రూ.450 ఒక్కో చీరపై ఖర్చు చేస్తూ 65 లక్షల మంది మహిళా సంఘాల సభ్యులకు రెండు చీరల చొప్పున పంపిణీ చేయనున్నామని తెలిపారు. ఆర్థిక వ్యవస్థ ఇబ్బందికరంగా ఉన్నా పేద ప్రజలపై పన్నుల భారం మోపకుండా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని అన్నారు. సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. చేనేత పవర్‌లూమ్ కార్మికులను ఆదుకోవాలనే ఉద్దేశంతో సిఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చర్యలు చేపడుతున్నారని అన్నారు. విద్యపై సిఎం ప్రత్యేక శ్రద్ధ పెట్టారని అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ ప్రత్యేకంగా అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌ఛార్జి కెకె మహేందర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్, ఆర్‌డిఓ వెంకటేశ్వర్లు, చేనేత జౌళి శాఖ అధికారులు పాల్గొన్నారు.

## రాజీనామా చేసి మళ్లీ ఎన్నికలకు వెళ్లేందుకు కాంగ్రెస్ సిద్ధమా?: రఘునందన్‌రావు



పీసీసీ అధ్యక్షుడిగా ఏది పడితే అది మాట్లాడితే ఊరుకునేది లేదని, ఓటు చోరీకి పాల్పడి ఉంటే దేశంలోని అన్ని పార్లమెంట్ స్థానాలను తామే గెలుస్తామని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ బాధ్యత మరిచి మాట్లాడుతున్నారని విమర్శించారు. తమ పార్టీ ఎంపీలందరం రాజీనామా చేసి మళ్లీ ఎన్నికలకు వెళతామని, దానికి కాంగ్రెస్ సిద్ధమా? అని సవాల్ విసిరారు. రాజీనామా చేసే ధైర్యం ఉందా? అని ప్రశ్నించారు. మేం ఓట్ల చోరీకి పాల్పడినట్టయితే తెలంగాణలో కాంగ్రెస్ ఎనిమిది చోట్ల ఎలా గెలిచిందని, అసదుద్దీన్ ఒవైసీ ఎలా విజయం సాధించారని నిలదీశారు. దమ్ముంటే మీ ఎనిమిది మంది ఎంపీలతో రాజీనామా చేయించాలని, తాము కూడా రాజీనామా చేస్తామని అన్నారు. కొత్త ఓటరు లిస్టుతో మళ్లీ ఎన్నికలకు వెళదామని వ్యాఖ్యానించారు. అప్పుడు వాస్తవాలు ఏమిటో ప్రజలకు తెలుస్తాయని అన్నారు. బీజేపీని అడిగి కామారెడ్డి డిక్లరేషన్ హామీ ఇచ్చారా అని ప్రశ్నించారు. కుంటిసాకులు చెప్పకుండా బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరంపై నిజాయతీగా కమిషన్ నివేదికను రాష్ట్ర ప్రజల ముందు ఉంచాలని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహణ లోపం కారణంగానే యూరియా కొరత తలెత్తిందని అన్నారు. ఇతర రాష్ట్రాల్లో లేని యూరియా కొరత ఇక్కడే ఎందుకు ఉందని ప్రశ్నించారు.




## 4454 మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు

రాష్ట్రంలో ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ పూర్తయింది. మొత్తం 4,454 మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించబోతున్నట్లు పాఠశాల విద్యాశాఖ వెల్లడించింది. 880 మంది స్కూల్ అసిస్టెంట్లకు గ్రేడ్ 2 గెజిటెడ్ హెడ్‌మాస్టర్లుగా పదోన్నతులు కల్పించించింది. అందులో మల్టీజోన్ 1లో 490 మంది, మల్టీజోన్ 2లో 390 మంది పదోన్నతులు పొందారు. 3,574 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లకు పదోన్నతులు ఇవ్వగా, 811 మందికి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతులు ఇచ్చింది. అదేవిధంగా 2,763 మంది ఎస్‌జిటిలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి పాఠశాల విద్యాశాఖ పదోన్నతులు కల్పించింది. షెడ్యూల్ ప్రకారం సకాలంలో పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేసినట్లు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు నవీన్ నికోలస్ తెలిపారు. పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులు 15 రోజులలోగా పదోన్నతి పొందిన పోస్టులు చేరాలని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఖాళీల మేరకు కాలానుగుణంగా టీచర్ల అర్హతల మేరకు ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీ చేపట్టనున్నట్లు వెల్లడించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు అందుబాటులోకి రావడం కీలకంగా మారనుందని అన్నారు. ప్రస్తుతం విద్యాశాఖకు కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డినే మంత్రిగా ఉన్నారు. విద్యావ్యవస్థను బలోపేతం చేయడమే తన లక్ష్యమని సిఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే పలుమార్లు చెప్పారు. ఇతరులకు ఇస్తే శాఖను పట్టించుకుంటారో లేదో అనే సందేహంతో తన వద్దే ఉంచుకున్నట్లు పేర్కొన్నారు. పాఠశాలల్లో రెగ్యులర్ ప్రధానోపాధ్యాయులు లేకపోవడంతో పలు సమస్యలు నెలకొంటున్నాయి. ఈ క్రమంలో తాజాగా పదోన్నతులతో పాఠశాలలకు ప్రధానోపాధ్యాయులు అందుబాటులోకి రానున్నారు. ఉపాధ్యాయులకు షెడ్యూల్ ప్రకారం పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేయడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.

# యూరియా కోసం రైతులు ధర్నాలు చేస్తుంటే.. సిఎం, మంత్రులు ఎక్కడ?: కెటిఆర్



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో రైతులు యూరియా కోసం అనేక ఇబ్బందులు పడుతున్నారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తెలిపారు. యూరియా కోసం రైతులు ధర్నాలు చేస్తుంటే.. సిఎం, మంత్రులు ఎక్కడ? అని ప్రశ్నించారు. సమస్యలు ఇక్కడుంటే సిఎం, మంత్రులు ఉండేది ఢిల్లీ, బీహార్ లోనా? అని కెటిఆర్ నిలదీశారు. ఈ సందర్భంగా కెటిఆర్ మీడియాతో మాట్లాడుతూ.. జాతీయ పార్టీలకు ఓట్లు.. రాష్ట్ర ప్రజలకు పాట్లు అని ఎద్దేవా చేశారు. యూరియాను కాంగ్రెస్ ఎంపిలు తేలేరని బిజెపి ఎంపిలు అడగరు అని కెటిఆర్ చురకలంటించారు.

## భారత ఎగుమతులపై 50% సుంకాలు

ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా మాత్రం టారిఫ్‌ల ప్రభావంపై మాట్లాడారు. యుఎస్ విధించిన 50 శాతం టారిఫ్‌లు ఆగస్టు 27 నుంచి అమల్లోకి రానున్నాయి. యుఎస్ టారిఫ్‌లు దేశీయ ఆర్థిక వృద్ధిని ప్రభావితం చేస్తే ఆర్‌బిఐ తగిన విధాన చర్యలతో స్పందిస్తుందన్నారు. మేము బ్యాంకింగ్ రంగానికి తగినంత నగదు లభ్యతను అందించాము. ముఖ్యంగా ఎక్కువగా ప్రభావితమైన రంగాలకు మద్దతును ఇవ్వడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటాము. ఆర్‌బిఐ ద్రవ్యోల్బణాన్ని నియంత్రిస్తూనే మరోవైపు ఆర్థిక వృద్ధిపై దృష్టి కోల్పోలేదని మల్హోత్ర అన్నారు.భారత్ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని మల్హోత్ర ఆశాభావం వ్యక్తం చేశారు. భారత్ వద్ద ఇప్పటికే 695 బిలియన్ డాలర్ల విదేశీ మారకద్రవ్య నిల్వలు ఉన్నాయని.. ఇవి 11 నెలల విదేశీ వాణిజ్యానికి సరిపోతాయన్నారు. సుంకాల మొత్తం ప్రభావం తక్కువగా ఉంటు-ందని మల్హోత్ర తెలిపారు. అయితే.. రత్నాలు, ఆభరణాలు, -టె-క్స్-టైల్స్, దుస్తులు, ఎంఎస్‌ఎంఇ రంగాలపై కొంత ప్రభావం ఉండవచ్చన్నారు. ప్రభుత్వం ఉచిత వాణిజ్య ఒప్పందాలపై కూడా దృష్టి సారిస్తోందన్నారు. వృద్ధికి తమ వంతుగా ఇప్పటికే రెపోరేటు-ను 100 బేసిస్ పాయింట్లు- తగ్గించిందని గుర్తు చేశారు. అభివృద్ధికి అడ్డంకిగా ఉన్న అంశాలను అధిగమించేందుకు తీవ్రస్థాయిలో కృషి చేస్తున్నామన్నారు. బ్యాంక్ రుణాలను విస్తరించేందుకు అవసరమైన చర్యలను తాము పరిశీలిస్తున్నామన్నారు. పెట్టుబడుల సైకిల్‌ను సృష్టించేందుకు వీలుగా కార్పొరేట్‌లు, బ్యాంక్‌లు ఓ తాటి పైకి వచ్చి పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. అప్పుడే దేశాభివృద్ధి ముందు కెళ్తుందని మల్హోత్ర అన్నారు. ధరల స్థిరీకరణ, ఆర్థికవృద్దే లక్ష్యంగా ద్రవ్య పరపతి విధానం కొనసాగుతుం దన్నారు. స్థూలంగా భారత ఆర్థికవ్యవస్థ పునాదులు బలంగా ఉన్నాయన్నారు.

## నేడు ఖైరతాబాద్ వినాయకుడికి ప్రాణప్రతిష్ఠ

డోర్ ఫ్రేం, హ్యాండ్ మెటల్ డి-టె-క్టర్లతో భక్తులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరమే దర్శనానికి అనుమతిస్తామని తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకే దర్శనానికి అనుమతి ఉంటుందన్నారు. భక్తులు విలువైన ఆభరణాలను, వస్తువులను తీసుకొని రాకూడదని తెలిపారు. ఉత్సవ కమిటీల ప్రతినిధులు అతిథులు, వీఐపీలను సాధ్యమైనంత వరకు ఉదయం నుంచి మధ్యాహ్నంలోపే వచ్చేలా ఆహ్వానించాలని కోరారు. ఉత్సవ కమిటీ- తరఫున 100 మంది ప్రైవేట్ సెక్యూరిటీ- సిబ్బందిని తమకు అందించాలని పోలీసులు కోరారు. తమ సిబ్బందికి అదనంగా వారి సేవలను 3 షిఫ్టుల్లో వాడుకుంటామని, మొత్తం 100 మందిని తమకు అప్పగిస్తే వారికి పోలీసు అధికారులు అవసరం మేరకు వినియోగించుకుంటారని ఏసీపీ సంజయ్ కుమార్ తెలిపారు. ఖైరతాబాద్‌లో బుధవారం బడా గణేశ్ కొలువు దీరనున్నాడు. గణనాథుడిని చూసేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలి రానున్నారు. ఈ నేపథ్యంలో ఖైరతాబాద్ చుట్టుపక్కల పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఈ నెల 27 నుంచి సెప్టెంబర్ 6 వరకు ఈ ఆంక్షలు అమలులో ఉంటాయని వెల్లడించారు. ఖైరతాబాద్, షాదన్ కాలేజీ, నిరంకారి, ఓల్డ్ పీఎస్ సైఫాబాద్, మింట్‌కాంపౌండ్, నెక్లస్ రోటరీ వద్ద ట్రాఫిక్ జామ్ అయ్యే అవకాశాలు ఎక్కువ అని తెలిపారు. ఈ నేపథ్యంలో పది రోజులపాటు- వాహనాలు దారిమళ్లింపులు ఉంటాయని చెప్పారు. ఈ నేపథ్యంలో వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని సూచించారు.

## ఈ నెల 29న కేబినెట్ సమావేశం

ఆమోదించనున్నారు. అనంరతం ఆ రిపోర్టును అసెంబ్లీ సమావేశాల తొలి రోజే సభలో ప్రవేశపెట్టనున్నారు. దీంతోపాటు బిసి రిజర్వేషన్లు, అసెంబ్లీ సమావేశాల తేదీల ఖరారు, సర్పంచ్ ఎన్నికలు తదితర అంశాలపై చర్చించనున్నట్టుగా తెలిసింది. ఈ భేటీలో డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు, ప్రభుత్వ సలహాదారులు, సిఎస్ రామకృష్ణా రావు పాల్గొనున్నారు.

### 30 నుంచి అసెంబ్లీ సమావేశాలు

రాష్ట్ర శాసనసభ వర్షాకాల సమావేశాలు ఈ నెల 30న ప్రారంభమం కానున్నాయి. అయితే ఈ నెల 29న జరగబోయే మంత్రివర్గ సమావేశంలో శాసనసభను ఎన్ని రోజులు నిర్వహించాలి ? అనేది చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై పిసి ఘోష్ కమిషన్ సమర్పించిన నివేదికను సభలో ప్రభుత్వం సభలో ప్రవేశపెడుతుంది. కాళేశ్వరం నివేదిక ఆధారంగా ఎవరెవరిపై చర్యలు తీసుకోవాలన్న అంశంపైనా చర్చ జరుగుతుంది. ఈ చర్చ సందర్భంగా పాలక, ప్రతిపక్షాల మధ్య తీవ్ర దుమారం చెలరేగే అవకాశం లేకపోలేదు. బిఆర్ఎస్ అధినేత, ప్రతిపక్ష నేత కె. చంద్రశేఖర్ రావు సభకు హాజరవుతారా? అనే చర్చ కూడా రాజకీయ పార్టీలు, విశ్లేషకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. కెసిఆర్ సభకు హాజరైతే కాళేశ్వరంపై చాలా లోతుగా వివరణ ఇవ్వాల్సి ఉంటుంది. కాళేశ్వరం నిర్మాణం వల్ల లక్షలాది ఎకరాలకు సాగు నీరు అందుతున్నదని, కెసిఆర్ అభినవ భగరీధుడు అని బిఆర్ఎస్ నాయకులు పొగుడుతుండగా, మేడిగడ్డ కుంగుబాటు, కోట్లాది రూపాయల దుర్వినియోగం, అవినీతి జరిగిందని అధికార పార్టీ ఇప్పటికే ధ్వజమెత్తుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అసెంబ్లీ సమావేశాలు వాడి వేడిగా జరిగే అవకాశం ఉంది.

## గవర్నర్లకు విచక్షణాధికారం

కొంత సమస్యాత్మకమనేనని రాజ్యాంగ ధర్మాసనం పేర్కొంది. బిల్లులకు గవర్నర్లు ఆమోదం ఇవ్వకుండా వీటో చేస్తే.. వారు మనీ బిల్లులను కూడా అడ్డుకోవచ్చని అభిప్రాయం వ్యక్తం చేసింది. సుప్రీం ధర్మాసనం అభిప్రాయంతో సీనియర్ న్యాయవాది హరీష్ సాల్వే ఏకీభవించారు. బిల్లుల ఆమోదం అంశంలో గవర్నర్లు, రాష్ట్రపతికి కాలపరిమితి విధించడంపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరుపుతోంది. బిల్లులను 3 నెలల గడువులోగా గవర్నర్లు, రాష్ట్రపతి ఆమోదించాలంటూ గతంలో జస్టిస్ పార్ధీవాలా ధర్మాసనం ఇచ్చిన తీర్పుపై దుమారం రేగింది. దీంతో రాష్ట్రపతి దౌపది ముర్మ 12 సందేహాలను లేవనెత్తారు. రాజ్యాంగంలో లేని అధికారాలపై సుప్రీంకోర్టు తీర్పులు ఎలా ఇవ్వగలదని అపెక్స్ కోర్టుకు 12 ప్రశ్నలతో రాష్ట్రపతి ద్రౌపది ముర్మ లేఖ రాశారు. ఈ నేపథ్యంలో సీజెఐ బీఆర్ గవాయ్, న్యాయమూర్తులు సూర్యకాంత్, విక్రమ్‌నాథ్, పీఎస్ నరసింహా, ఏఎస్ చందూర్‌కర్‌తో కూడిన రాజ్యాంగ ధర్మసనం మంగళవారం నాడు విచారణ జరుపుతోంది.

# న్యాయవాది శ్రీకాంత్‌పై దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలి

### న్యాయవాదుల భద్రత కోసం ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలి

### సీనియర్ న్యాయవాది రామ్మోహన్ సాగర్

హయత్ నగర్ వార్త మిర్రర్ ప్రతినిధి : న్యాయవాది శ్రీకాంత్ పై కూకట్ పల్లి లో దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని తక్షణమే న్యాయవాదుల భద్రత కోసం ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలని హయత్ నగర్ కోర్టు ఆవరణలో న్యాయవాదులు డిమాండ్ చేశారు.సోమవారం రోజున ఓ కేసు విచారణలో భాగంగా అడ్వకేట్ కమీషన్ గా నియమితులైన కూకట్ పల్లి హైదరాబాద్ కోర్టు బార్ అసోసియేషన్ సభ్యులు న్యాయవాది తన్నీరు శ్రీకాంత్ కోర్టు వారెంట్ అమలు చేస్తున్న సందర్భంగా జెడిఆర్ లు మరియు వారి అనుచరులు కర్రలతో దాడి చేయడంతో న్యాయవాది శ్రీకాంత్ కు అనేక గాయాలు అయ్యాయని తెలిపారు. ఇది కేవలం ఒక వ్యక్తిగత న్యాయవాదిపై జరిగిన దాడి కాదని న్యాయవాద సమాజంపై మరియు కోర్టు గౌరవంపై జరిగిన తీవ్రమైన దాడి అని అన్నారు. న్యాయవాదులపై వరుస దాడులు జరుగుతుండడం చూస్తుంటే న్యాయవాద వృత్తిని జటిలం చేస్తున్నాయని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు ఈ దాడులను అరికట్టడంలో విఫలమయ్యాయని విమర్శించారు. దోషులపై వెంటనే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, మరియు న్యాయవాదులు తమ వృత్తిపరమైన విధులు నిర్వర్తించేటప్పుడు వారి



భద్రత మరియు భద్రత నిర్ధారించడానికి న్యాయవాధుల రక్షణ చట్టాన్ని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో రామ్మోహన్ సాగర్, ప్రభాకర్, బండి నరేష్, సురేందర్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, మంచాల శంకర్, సత్యానారాయణ, తదితరులు పాల్గొన్నారు

# పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ లను విడుదల చేయాలి

### ఎబివిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్యాల రాకేష్

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఆగష్టు 26 : విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని గురుకులాల్లో మెరుగైన వసతి కల్పించాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ జగిత్యాల శాఖ ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించడం జరిగింది.బి ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్యాల రాకేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించిందని విద్యార్థులకు రావలసిన ఫీజులను 8700 కోట్లను పెండింగ్ లో పెట్టింది. తద్వారా విద్యార్థులు ఉన్నత చదువులకు వెళ్లాలంటే కళాశాల యాజమాన్యాలు ఫీజులు చెల్లించాలని విదార్థుల దగ్గరి నుండి వసూలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. జగిత్యాల జిల్లాలో వివిధ పాఠశాలల్లో అధ్యాపకులు విద్యార్థుల పట్ల లైంగిక దాడులకు పాల్పడితే వారిపైన చర్య తీసుకోకుండా డిఈఓ నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం చాలా బాధాకరమని అన్నారు. అనుమతులు లేకుండా ప్రవేట్ కార్పోరేట్ పాఠశాలలు నడుస్తున్నాయి. అదేవిధంగా ఇష్టానుసారంగా ప్రైవేటు పాఠశాలలకు పర్మిషన్ లు ఇస్తున్నారని తెలియజేశారు. జగిత్యాల జిల్లా వ్యాప్తంగా సాంఘిక సంక్షేమ హాస్టల్ లో వసతులు సరిగా లేని కారణంగా అద్దె భవనంలో విద్యార్థులు ఇరుకిరుకు గదుల్లో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు మెస్,కాస్మోటిక్ ఛార్జీలు పెంచలేదని తద్వారా నాణ్యమైన భోజనం అందడం లేదని దీనికి ప్రభుత్వ వైఫల్యం మే కారణమని ఆరోపించారు. లక్ష్మీపూర్ జగిత్యాల మల్యాల పెద్దాపూర్ తదితర పరిసరాల్లో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాల్లో టీచింగ్-నాన్ టీచింగ్ సిబ్బంది లేని కారణంగా విద్యార్థులే చదువుకోవాల్సిన దౌర్భాగ్యమైన స్థితికి దిగజార్చింది. దీనితోపాటు గురుకులాల లో నిత్య కృత్యంగా మారిన ఫుడ్ పాయిజన్ లను అరికట్టలేక పోయింది. అధికారులు మంత్రులు పేపర్ల ప్రకటనలకే తప్ప సమస్య పరిష్కారం జరిగిన దాఖలాలు లేవని ఎద్దేవా చేశారు. మత్తుమాదకద్రవ్యాలు, గంజాయి విచ్చలవిడిగా పాఠశాలలో కళాశాలల కేంద్రంగా



పెరిగిపోతున్న ప్రభుత్వం పట్టించుకోవడంలేదని, విద్యార్థులను పట్టించుకునే బాధ్యత ప్రభుత్వానికి లేదా అని ప్రశ్నించారు. అదేవిధంగా సకాలంలో ఫీజులు అందని కారణంగా కొన్ని ప్రైవేటు కళాశాలలో డిగ్రీ కళాశాలలో మూసివేసిన వైనం చోద్యం చూస్తుంది ఈ ప్రభుత్వం. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి వెంటనే మొండి బకాయలను విడుదల చేయాలని ఏబీవీపీ డిమాండ్ చేస్తుంది అని అన్నారు. అనుమతులు లేకుండా నడుస్తున్న ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలపై అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. విద్యను పూర్తిగా వ్యాపారంగా మారుస్తున్న యాజమాన్యాలపై చట్టరిత్య చర్యలు తీసుకొని గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, రాష్ట్ర ముఖ్యమంత్రి విషయాలన్నిటిపై చర్చించి నిర్ణయాలు తీసుకుని విద్యా సంస్థలను విద్యారంగాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. లేనిపక్షంలో ధర్నాలు ఉద్యమాలను నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి కుందారపు రాజు, జోనల్ ఇంచార్జ్ రాపాక నిఖిల్ ఎస్ఎఫ్ డి జగిత్యాల జిల్లా కన్వీనర్ కళ్యాణ్, శ్రీనివాస్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

# న్యాయవాది శ్రీకాంత్ పై దాడిని తీవ్రంగా ఖండిస్తూ చౌటుప్పల్ లో న్యాయవాదుల నిరసన

### న్యాయవాదుల భద్రత కోసం ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలి: బాల్యం వెంకటాచలపతి

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధిహైదరాబాద్‌లోని కూకట్‌పల్లి కోర్టు పరిధిలో జరిగిన ఒక ఘోర ఘటనలో, న్యాయవాది తన్నీరు శ్రీకాంత్ గారు కోర్టు బెలీఫ్‌తో కలిసి సివిల్ కేసులో కోర్టు జారీ చేసిన వారెంట్‌ను అమలు చేయడానికి కాక్షిదారులతో కలిసి వెళ్లారు. అయితే వృత్తి పరమైన విధుల్లో భాగంగా వారెంట్ అమలు చేస్తున్న సమయంలో, కొంతమంది అరాచకులు న్యాయవాది పై దాడి చేయడం జరిగింది. ఈ ఘోర సంఘటన న్యాయవాదుల సమాజానికి తీవ్ర ఆందోళన కలిగించింది.ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తూ, ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్స్ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని బార్ అసోసియేషన్లు ఈరోజు నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఆ పిలుపులో భాగంగా చౌటుప్పల్ కోర్టులో కూడా న్యాయవాదులు మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా చౌటుప్పల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు బాల్యం వెంకట చలపతి గారు మాట్లాడుతూ, "వృత్తి పరంగా విధులు నిర్వహిస్తున్న న్యాయవాది పై దాడి చేయడం అమానవీయమైనది, మేము దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నాము. దాడి చేసిన నేరస్థులను వెంటనే అరెస్టు చేసి కఠిన శిక్షలు విధించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాము. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే న్యాయవాద రక్షణ చట్టం అమలు చేయాలని ఈ సందర్భంగా మేము బలంగా కోరుతున్నాము," అన్నారు. రాష్ట్రంలో ఇలాంటి ఘటనలు గత కొన్నేళ్లుగా పునరావృతం



అవుతున్నప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకపోవడం విచారకరం. న్యాయవాదులు చట్టపరమైన పరిధిలో కక్షిదారులకు అండగా నిలబడి న్యాయం సాధనలో పోరాటం చేస్తున్నారు. ఈ విషయం ప్రజలు కూడా అర్థం చేసుకోవాలి," అని అన్నారుఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు రాపోలు వేణు, ప్రధాన కార్యదర్శి పడమటి మైపాల్ రెడ్డి, కోశాధికారి జల్ల రమేష్, లైబ్రరీ సెక్రటరీ జక్కర్తి శేఖర్, కల్చరల్ సెక్రటరీ దేశగోని శ్రీశైలం, కార్యవర్గ సభ్యులు నకరికంటి జ్యోతి, ఎండి ఖయ్యూం పాషా, మాజీ అధ్యక్షులు ఉడుగు శ్రీనివాస్ గౌడ్, వాకిటి నరసింహారెడ్డి, న్యాయవాదులు ముత్యాల సత్తిరెడ్డి, తడక మోహన్, తాడూరి పరమేష్, పిట్టల భిక్షమయ్య, పాల పరమేష్, చామట్ల జంగయ్య, గంగదేవి రవీందర్, భరత్ చంద్ర,శ్రీకాంత్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళల భద్రత స్వేచ్ఛ కోసం షీ టీం ఎఎస్ఐ తబిత

మిర్యాలగూడ, ఆగస్టు 26:-( వార్త మిర్రర్) మహిళల భద్రత, గౌరవం, స్వేచ్ఛ కోసం 2014 అక్టోబర్ 24న తెలంగాణా ప్రభుత్వం ఏర్పాటు చేసిన విశిష్టమైన పథకం షీ-టీం అని, దీనిని బాలికలు, మహిళలు తమ భద్రత కొరకు ఉపయోగించుకోవాలని షీ టీం ఏఎస్ఐ తబిత పిలుపునిచ్చారు. కెఎన్ఎం. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో షీ టీం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ సివిల్ డ్రెస్‌లో పనిచేసే పోలీసులతో టీమ్ ఉంటుందని, వీరు 24 గంటలు అందుబాటులో ఉంటారని, మహిళలు తమ స్వేచ్ఛ, గౌరవానికి భంగం కలుగుతున్నప్పుడు 100, 8712670235 నల్గొండ ఫోన్ నంబర్ల ద్వారా, వాట్సాప్ ద్వారా వీరిని సంప్రదించవచ్చని ఆమె తెలిపారు. తెలంగాణ పోలీస్ విభాగం ఏర్పరచిన ప్రత్యేక బృందం రోడ్డుమీద, బస్సులలో, పబ్లిక్ ప్లేసులలో మహిళలపై వేధింపులను అరికట్టేందుకు నిరంతరం అందుబాటులో ఉంటుందని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రధానాచార్యులు మల్గిరెడ్డి భీమార్జునరెడ్డి మాట్లాడుతూ పోలీసుల నిఘా, ట్యాబ్‌లు, మొబైల్ ద్వారా రికార్డింగ్, సిసి కెమెరా మొదలైన వాటి ఆధారంగా నేరగాళ్లను ఈ బృందం గుర్తిస్తుందని, మహిళలు ఫిర్యాదు చేయకపోయినా, వారు స్వయంగా నేరగాళ్లను గుర్తించి చర్యలు తీసుకుంటుందని, మహిళల భద్రత ప్రతిఒక్కరి బాధ్యతని, మంచి సమాజం కోసం



మనందరం కలిసి పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో షీ టీం ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఏఎస్ఐషరీఫ్, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విద్యను అందించడమే నిజమైన అభివృద్ధి

### ::: ఎమ్మెల్యే బిఎల్ఆర్

మిర్యాలగూడ, ఆగస్టు 26:- (వార్త మిర్రర్) మిర్యాలగూడ శాసనసభ నియోజకవర్గం దామరచర్ల మండల కేంద్రంలో రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం జూనియర్ కళాశాల అదనపు భవన సముదాయాన్ని శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ మంగళవారం ప్రారంభించారు. అనంతరం విద్యార్థినులతో కలిసి అల్పాహారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో విద్యకు ప్రాధాన్యత ఇస్తున్నారు అందులో భాగంగానే గురుకులాలలో కాస్మోటిక్ ఛార్జీలు, మెస్ చార్జీలు పెంచారన్నారు. రాష్ట్రంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ తీసుకొని వస్తున్నారన్నారు. అదే విధంగా మిర్యాలగూడ నియోజకవర్గంలో కూడా ప్రతీ పేద విద్యార్థికి మెరుగైన విద్యను అందించే లక్ష్యంగా సిఎస్ఆర్ ఫండ్స్ ద్వారా ప్రభుత్వ గురుకుల పాఠశాలలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కు కూడా తెలిపామన్నారు. ప్రతీ ఒక్కరికి నాణ్యమైన విద్యలు అందించడమే నిజమైన అభివృద్ధని అన్నారు. ఒక విద్యార్థి చదువుకొని అభివృద్ధి చెందితే ఒక వ్యవస్థ అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రతీ విద్యార్థి మంచిగా చదువుకొని మిర్యాలగూడకు మంచి పేరు తీసుకొని రావాలన్నారు. కార్యక్రమంలో దామరచర్ల జవహర్లాల్, ఎంపిడిఓ కృష్ణమూర్తి, ఎంఇఓ ఎం. బాలాజీనాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు డి.స్కై ల్యాబ్ నాయక్, బెజ్జం సాయి,



నాగునాయక్, పొదిల శ్రీనివాస్, డి.రవితేజ, నర్సింహారెడ్డి,గాలం శ్రీనివాస్, కిరణ్, మాజీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, బి ఎల్ ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు..



# అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న రాంపల్లి రామేశ్వర్ కి ఆర్థిక చేయూత

### రామేశ్వర్ కి 20 వేల ఆర్థిక సహాయం అందించినం మెరిశెట్టి సంతోష్ కుమార్

హయత్ నగర్ వార్త మిర్రర్ ప్రతినిధి : మనసురాబాద్ డివిజన్ వినాయక నగర్ లో నివాసం ఉంటున్న రాంపల్లి రామేశ్వరి గత కొంతకాలంగా అనారోగ్యానికి విషయాన్ని తెలుసుకున్న భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు మోరిశెట్టి సంతోష్ కుమార్ వారి నివాసానికి వెళ్లి పరామర్శించి వారికి 20 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా మొరిశెట్టి సంతోష్ కుమార్ మాట్లాడుతూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సరైన సమయానకి మందులు వాడి త్వరగా కోలుకోవాలని తెలిపారు ఈ కార్యక్రమంలో కడారి యాదగిరి యాదవ్, బోడ వెంకటరమణ గౌడ్, జయతేజ్, ప్రవీణ్ గౌడ్, మోహన్ రెడ్డి, న్ బొమ్మల గుడి బిజెపి కార్యాలయ సభ్యులు అనారోగ్యంతో బాధపడుతున్న రామేశ్వరుకి ఆర్థిక సహాయం అందించడం హర్షినియమని మొరిశెట్టి సంతోష్ కుమార్ ను అభినందించారు



# చండూరులో ప్రాథమిక ఆసుపత్రిని పునర్ నిర్మించాలి

### బిజెపి పట్టణ అధ్యక్షుడు పందుల సత్యం గౌడ్ ఆధ్వర్యంలో ఆర్డీవోకు వినతి

నల్గొండ జిల్లా వార్త మిర్రర్ ప్రతినిధి...చండూర్ మున్సిపల్ కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి శిథిలావస్థలోకు వచ్చి కృంగిపోయి కూల్పోయే ప్రమాదంలో ఉన్నది అని మొత్తం పగుళ్లతో శిథిలావస్థలో ఉండి పాములు విషపురుగులకు నిలియంగా మారి ప్రజలు నానా ఇబ్బందులకు గురవుతున్నారు అని చండూరు భారతీయ జనతా పార్టీ పట్టణ అధ్యక్షుడు పందుల సత్యం గౌడ్ అన్నారు. ఇట్టి భవనాన్ని గతంలో నల్గొండ జిల్లా కలెక్టర్ పరిశీలించి తక్షణమే మార్చాలని కూడా చెప్పారు. అయినా అధికారులు స్పందించడం లేదు, కాబట్టి ప్రస్తుతం ఉన్న భవనాన్ని కూల్చివేసి 30 పడకల ఆసుపత్రి గా పునరుద్ధరణ చేయాలని పలువురు బీజేపీ నాయకులు వ్యక్తం చేశారు. అలాగే ఆస్పత్రి సిబ్బంది కూడా ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఓబిసి మోర్చా అధికార ప్రతినిధి కోమటి వీరేశం, జిల్లా కౌన్సిల్ సభ్యులు భూతరాజు శ్రీహరి, సింగిల్ విండో డైరెక్టర్ బోడా ఆంజనేయులు, జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి అన్నపర్తి యాదగిరి, జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శి సామ వెంకటరెడ్డి, జిల్లా ఎస్సీ మోర్చా కార్యదర్శి ఇరిగి ఆంజనేయులు, జిల్లా నాయకులు తడకమల్ల శ్రీధర్ కల్లెం సురేందర్ రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శులు భూతరాజు స్వామి, సోమ శంకర్, ఉపాధ్యక్షులు కోమటి ఓంకారం, చేనగోని శేఖర్, పార్టీ కోశాధికారి మంచుకొండ సాగర్, పార్టీ కార్యదర్శులు ముష్టిపల్లి జీవన్ బూత్ అధ్యక్షులు తోకల రవీందర్, చిట్టిపోల వెంకటేశం పాల్గొన్నారు.



# ఇటిక్యాల గ్రామానికి బస్సులను పొడగించాలని వినతి

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఆగస్టు 26 జగిత్యాల జిల్లా రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామానికి బస్సులను పొడిగించాలని మంగళవారం గ్రామ నాయకులు జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ సిఫారసుతో కూడిన లేఖను కోరుట్ల డిపో మేనేజర్ మనోహర్‌కు అందజేశారు.రేగుంట-ఇటిక్యాల, రాయికల్-ఇటిక్యాల మార్గాల్లో బస్సులను పొడగించాల్సిన అవసరం ఉందని వారు తెలిపారు. ప్రజలకు రాకపోకలు సులభంగా ఉండేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కాటిపల్లి గంగారెడ్డి, నాయకులు సామల్ల వేణు, మరిపెల్లి శ్రీనివాస్ గౌడ్, సామాజిక సేవకులు అనుపురం లింబాద్రి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు అల్లీపూర్ విద్యార్థిని ఎంపిక

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఆగష్టు 26 : ఇటీవల జగిత్యాల జిల్లా స్వామి వివేకానంద మినీ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలలో రాయికల్ మండలం అల్లీపూర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాకు చెందిన టీ.అనూష షాటపుట్ విభాగంలో ప్రథమ స్థానం సాధించి ఈనెల 30,31తేదీలలో మహబూబ్ నగర్ లో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యా యులు పోరండ్ల కిరణ్ తెలిపారు .ఎంపికైన విద్యార్థినిని పీడీ క్రిష్ణ ప్రసాద్, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.





## రాయికల్ మండలంలోని వివిధ గ్రామాలలో పర్యటించిన జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఆగష్టు 26 : ప్రభుత్వ ఆదేశాల క్రమము గిరిజన గ్రామాలలో వివిధ అభివృద్ధి పనుల కొరకు అంచనాలను తయారు చేయడానికి జగిత్యాల జిల్లా రాయికల్ మండలం జగన్నాథ్ పూర్ మరియు నాయకపు గూడెం గ్రామాలలో పలు అభివృద్ధి పనుల కొరకు ప్రత్యక్షంగా పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్, జిల్లాలోనీ గిరిజన గ్రామాలు మరియు తండాలలో అవసరమైన పలు అభివృద్ధి పనులు సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, డ్రైనేజీలు, పాఠశాల భవనాలు, అంగన్వాడీ సెంటర్లు, గ్రామపంచాయతీ కార్యాలయాలు, కమ్యూనిటీ హాళ్లు, వాటర్ ట్యాంకులు వంటి సౌకర్యాలను గుర్తించి, అవసరమైన అంచనాలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గిరిజన అభివృద్ధి శాఖ అధికారి రాజ్‌కుమార్, డిపిఓ మదన్ మోహన్, పీఆర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు లక్మన్ రావు, ఎంపీడీవో చిరంజీవి, తహసిల్దార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## ఫిరోజోద్దీన్ ఖురేషి చాహలూమ్ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ కర్నే ప్రభాకర్

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి : సంస్థాన్ నారాయణపురం గ్రామంలో ఫిరోజోద్దీన్ ఖురేషి ఇటీవల మరణించగా,నేడు వారి చహలూమ్ ( దినాలు) కార్యక్రమంలో పాల్గొని వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్ధించి అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫిరోజోద్దీన్ ఖురేషి గ్రామంలో అందరితో ఆత్మీయతతో, సోదరభావంతో కలిసి ఉండే మంచి మనిషి అనీ, ఎక్కడ కలిసిన గౌరవంగా ఆత్మీయతతో పలకరించేవాడని, ఫిరోజోద్దీన్ మన నుండి దూరం కావడం చాలా బాధాకరమైన విషయం అని గుర్తు చేస్తూ,వారి కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు రహీం షరీఫ్, గౌస్ మొద్దీన్, ఫయాజ్,ముస్లిం మత పెద్దలు మరియు బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు, పాల్గొన్నారు.

## శేరిలింగంపల్లి నియోజకవర్గం ప్రజలకి వినాయక చవితి శుభాకాంక్షలు...

### జాతీయ బిసి సంక్షేమ సంఘం శేరిలింగంపల్లి నియోజకవర్గ అధ్యక్షులు వల్లెపు మాధవరావు



శేరిలింగంపల్లి వార్త మిర్రర్ :శేరిలింగంపల్లి నియోజక వర్గం ప్రజలకి జాతీయ బీసీ సంఘం అధ్యక్షులు వల్లెపు మాధవరావు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకి, పాత్రికేయ మిత్రుల కి,అధికారులకు, అనధికారులకు, ప్రజా ప్రతి నిధులకు విఘ్నాలు తొలగించి విజయాలు సాధించాలని ఆ విఘ్నేశ్వర స్వామి ఆశీస్సులు అందరి పై ఉండాలనీ ఆశిస్తూ అందరికీ వినా యక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలంతా సామూహిక, సామరస్య వాతా వరణం లో జరుపుకునే ఈ అపూర్వమైన చవితి వేడుకలను భక్తి శ్రద్ధలతో సంతోషంగా జరుపుకోవాలని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.



## పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రజలు మట్టి గణపతిని పూజించాలి

### ::: 4వేల మట్టి గణపతి విగ్రహాల ఉచిత పంపిణి

మిర్యాలగూడ, ఆగస్టు 26:-( వార్త మిర్రర్) మిర్యాలగూడ పట్టణంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా పట్టణ ప్రజలందరూ మట్టి గణపతులను పూజించాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ కోరారు. మంగళవారం మిర్యాలగూడ మునిసిపల్ కార్యాలయంలో మట్టి వినాయకులను పంపిణి చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ మండపాల వద్ద ధ్వని కాలుష్యం లేకుండా చూడాలని, ప్రతి రోజు పారిశుద్ధ్యం, వీధిదీపాలు నిర్వహణ చేయాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. పట్టణ వినాయక ఉత్సవ కమిటీ సభ్యులను నవరాత్రి ఉత్సవాలు సజావుగా జరుపుటకు సహకరించాలని కోరారు. పట్టణంలో సుమారు 4,000 మట్టి విగ్రహాలు పంపిణి చేస్తున్నట్టు మునిసిపల్ కమీషనర్ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో డిఎస్పీ కె. రాజశేఖర్ రాజు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నూకల వేణుగోపాల్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పొదిలి శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు దేశిడి శేఖర్ రెడ్డి, కాంగ్రెస్ వార్డు ఇంచార్జిలు పి. శరత్, ఉబ్బపల్లి కాశయ్య, జి. జానకిరాంరెడ్డి, యాదగిరి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకన్న, మేనేజర్, రెవిన్యూ ఆఫీసర్ జి. జ్ఞానేశ్వరి, సానిటరీ ఇన్స్పెక్టర్ వెంకటరమణ, టిపిఎస్ అంజయ్య, పర్యావరణ ఇంజనీర్ శ్వేత, మెప్మా టిఎంసి పి. బక్కయ్య, సిఒ వెంకటేశ్వర్లు, పార్వతిలు పాల్గొన్నారు.

# గంజాయి అక్రమ రవాణా అంతర్రాష్ట్ర ముఠా అరెస్టు

### 1350గ్రాముల గంజాయి, 22గంజాయి చాక్లెట్లు, 8మొబైల్స్, 3బైకులు స్వాధీనం: డీఎస్పీ రాజశేఖర్రాజు



మిర్యాలగూడ, ఆగస్టు 26:- (వార్త మిర్రర్) అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న 10 మంది అంతర్రాష్ట్ర నిందితులను అరెస్టు చేసి, 1350 గ్రాముల గంజాయి, 8 మొబైల్ ఫోన్లు, 3మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామని మిర్యాలగూడ డిఎస్పీ కె. రాజశేఖరరాజు తెలిపారు. మంగళవారం స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్ లో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీహార్ రాష్ట్రం ఫూడ్ కిచౌక్ గోగుర్ టాసకు చెందిన రాజ్ కుమార్, సికిందర్, మిర్యాలగూడ పట్టణానికి చెందిన సమీర్ ల వద్ద మాదక ద్రవ్యాలు, గంజాయి కొనుగోలు చేసి మిర్యాలగూడ, మాడ్గులపల్లి మండలానికి చెందిన యువకులకు అధిక ధరలకు అమ్ముతున్నారని ఆయన తెలిపారు. అదేవిధంగా మాడ్గులపల్లి మండలం పూసలపాడు గ్రామానికి చెందిన కొండేటి యశ్వంత్ అలియాస్ చింటును పరిచయం చేసుకుని యువతకు గంజాయి అమ్ముతున్నారని తెలిపారు. ఈ నెల 25న రాజ్ కుమార్ పటేల్ యశ్వంత్ చింటు గంజాయిని కోడెల శివ, బొల్లెంపల్లి విష్ణు,బుర్రి లోకేష్, వంశీ, దైద సందీప్, పందిరి చరణ్ తేజ, మిర్యాల వివేకానందరెడ్డి, బుర్రి నవీన్ లకు అమ్మడానికి కొండేటి యశ్వంత్ బండి మీద మాడ్గులపల్లి పాత రైల్వే క్వార్టర్స్ వద్ద గంజాయి, గంజాయి చాక్లెట్స్ అందిస్తున్నరన్నారనే విశ్వసనీయ సమాచారంతో మాడ్గులపల్లి పోలీసులు వెళ్లి పట్టుకున్నారని ఆయన తెలిపారు. వారి నుండి 1350 గ్రాముల గంజాయి, 22 గంజాయి చాక్లెట్లు స్వాదీనం చేసుకున్నారని తెలిపారు. 13 మంది నిందితుల్లో 10మందిని అరెస్టు చేశామని ఆయన తెలిపారు. రాజ్ కుమార్ పటేల్, కొండేటి యశ్వంత్, కోడెల శివ, బొల్లెంపల్లి విష్ణు, బుర్రి లోకేష్, దైద సందీప్, గుండెబోయిన వంశీ, పందిరి చరణ్ తేజ, మిర్యాల వివేకానందరెడ్డి, బుర్రి నవీన్, శివం ఫార్మ డైరెక్టర్ లున్నారని ఆయన తెలిపారు. కేసును చేదించిన రూరల్ సీఐ పిఎన్డి ప్రసాద్, మాడ్గులపల్లి ఎస్ఐ ఎస్.కృష్ణయ్య, ఎఎస్ఐలు నర్సింహారావు, వెంకటేశ్వర్లు, ఎండి.జాఫర్ హెడ్ కాన్స్టేబుల్ శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, కాన్స్టేబుల్స్ సైదులు, సైదిరెడ్డి, అనిల్, ఆంజనేయులు, యాదయ్య, నరేష్, సైదులు, శ్రీనునాయక్, డ్రైవర్ సురేష్ లనుఎస్పీ శరత్ చంద్ర పవార్, డిఎస్పీ రాజశేఖర్ రాజు అభినందించారు.

# ఎన్నికల్లో పెన్షన్ పెంపు హామీలను వెంటనే అమలు చేయాలని మంద కృష్ణ మాదిగ డిమాండ్




శేరిలింగంపల్లి వార్త మిర్రర్ :వితంతువులను వృద్ధులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ను రేవంత్ రెడ్డిని నిలదీయడానికి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సెప్టెంబర్ 9 2025 న చలో హైదరాబాద్ అనే కార్యక్రమం లో భాగంగా పరేడ్ గ్రౌండ్ వేదికగా వికలాంగులకు 4000 నుండి 6000 , వితంతువులకు 2000 నుండి 4000, వృద్ధులకు 2000 నుండి 4000 విలువ చేస్తానని మాట ఇచ్చినాడు కానీ ఇవ్వలే కాబట్టి కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని వికలాంగులకు వృద్ధులకు వితంతువులకు ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్లు పెంచు డా కాంగ్రెస్ ప్రభుత్వం లో ఉన్న రేవంత్ రెడ్డి గద్దె దించుడా అనే డిమాండ్ తో కార్యక్రమం పెట్టడం జరిగింది.దానిలో భాగంగా ఈ సన్నాహక సదస్సును ఏర్పాటు చేయడం జరిగింది చందానగర్ జిహెచ్ఎంసి మున్సిపాలిటీ కళ్యాణ మండపంలోశేర్లింగంపల్లి నియోజకవర్గ సన్నహక సదస్సు మందకృష్ణ మాదిగ సమక్షంలో ఏర్పాటు చేయడం జరిగింది ఈ మీటింగ్ లో వికలాంగుల గురించి వితంతుల గురించి వృద్ధుల గురించి వారి స్థితిగతులు అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూవచ్చేనెల సెప్టెంబర్ 9న చలో హైదరాబాద్ అనేక కార్యక్రమంలో భారీ బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుంది మీ నియోజకవర్గం నుండి ప్రతి ఒక్కరు వికలాంగులు వితంతువులు అందరూ భారీ ఎత్తున తరలిరావాలని పిలుపునివ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో దివ్యాంగుల పట్టణ సమైక్య రాష్ట్ర అధ్యక్షులు ఎం.అశోక్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు విజయ్ కుమార్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫకీర్ సాబ్ ,దివ్యాంగుల రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు నంది నాగులు, ఎమ్మార్పీఎస్ నాయకులు గణేష్ మాదిగ, యాదగిరి మాదిగ , ప్రేమ్ కుమార్ మాదిగ, బేడ బుడగ జంగం జన సంఘం తెలంగాణ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ పత్తి బసవ శివ ,ఓంకార్ నగర్ కాలనీ మియాపూర్ బస్తీవాసులు బస్తీ యూత్ నాయకుడు కల్లెం రాజేష్, కల్లెం చంద్రయ్య, ఇస్సాకు, కృష్ణ సిరిగిరి చంద్రప్ప ,వృద్ధులు వితంతువులు గరుడ అంజనమ్మ ,గరుడ మల్లమ్మ, మొక్కులోడు మీనాక్షి ,మొకలోడు అమ్మమ్మ, పూసలోల కళ్యాణి ,మోకలోడు శాంతి ,నిర్మల, అంజమ్మ, మానెమ్మ ,పుష్పారాణి, వడ్డే తయారమ్మ ,నారాయణ , ఇంద్రమ్మ, శశికళ తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఆశావర్కర్‌గా నారాయణపూర్ గ్రామానికి చెందిన కర్ణాటి గనీల

### యాదాద్రి కలెక్టర్ హనుమంతరావు చేతుల మీదుగా ప్రశంసపత్రం

ఉమ్మడి నల్గొండ జిల్లా వార్త మిర్రర్ ప్రతినిధి : యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూర్ గ్రామానికి చెందిన ఆశా వర్కర్ కర్నాటి ఘనీలకు తన సేవను ప్రభుత్వం గుర్తించి ఉత్తమ ఆశా వర్కర్ గా ప్రశంసా పత్రాన్ని యాదాద్రి కలెక్టర్ హనుమంతరావు, తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి లు ఆగస్టు 15 తారీకు రోజున అందజేశారు. మంగళవారం రోజు మదర్ తెరిసా జయంతి సందర్భంగా ఉత్తమ ఆశా వర్కర్ గా ఎన్నికైన కర్ణాటి గనీలను మునుగోడు నియోజకవర్గ మైనార్టీ నాయకులు రహీం షరీఫ్ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.





# రాష్ట్రంలో యూరియా కొరత రైతు కంట కన్నీరు

### బిఆర్ఎస్వి కల్వకుర్తి అధ్యక్షుడు దారమోని గణేష్



కల్వకుర్తి ఆగస్టు 26 వార్త మిర్రర్ ప్రతినిధి:- కల్వకుర్తి పట్టణంలోని స్థానిక తెలంగాణ జాగృతి కార్యాలం ముందు తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు దారమోని గణేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఏ జిల్లాలో చూసిన పూర్తి స్థాయిలో యూరియా నిలువలు లేకపోవడంతో రైతులు తీవ్రస్థాయిలో ఇక్కట్లను ఎదుర్కొంటుంటే, తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ సర్కారు చోద్యం చూస్తూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పైన నెట్టే ప్రయత్నం చేస్తూ రాష్ట్రంలోని రైతాంగాన్ని మరియు రైతులని మోసం చేస్తూ రైతు వ్యతిరేక విధానాలు నడుపుతున్నటువంటి రేవంత్ సర్కార్ ఇక నైనా రాష్ట్రంలోని యూరియా కొరతను తీర్చాలని గణేష్ అన్నారు.రాష్ట్ర ప్రభుత్వానికి ఎరువుల కొరత పైన ముందు చూపు లేకపోవడం వ్యవసాయ రంగంపై అవగాహన లేకపోవడం వలనే నేడు రాష్ట్రంలో యూరియా కొరత ఏర్పడి రోడ్లపైకి రైతన్నలు వచ్చి నిరసనలు తెలుపుతున్న కాంగ్రెస్ తరపున చోద్యం చూస్తుంది. తెలంగాణ రాష్ట్రంలో నాడు కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న 10 సంవత్సరాలలో ఏనాడు రైతులకు యూరియా కొలతలు లేకుండా పూర్తి ప్రణాళికతో రైతులకు సకాలంలో అందించిన కేసిఆర్ ప్రభుత్వం గత ప్రభుత్వంలో రైతులకు నిరంతర 24 గంటల విద్యుత్ అందించి,రైతులకు పంట వేసుకునే సమయానికి రైతుబంధు డబ్బులు వేసేవారు నాడు కెసిఆర్ ప్రభుత్వంలో పంటకు పంటకు ముందు రైతుబంధు డబ్బులు వస్తే, నేడు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో ఓట్లకు ఓట్లకు మధ్య రైతుబంధు డబ్బులు వేస్తున్నారని, కేసీఆర్ ప్రభుత్వంలో ప్రమాదవశాత్తు చనిపోయిన రైతులకు రైతు బీమా 5 లక్షల రైతు మరణించిన వారం రోజుల్లో చెక్కులు వచ్చేవనినేటి కాంగ్రెస్ ప్రభుత్వం రైతన్న నడ్డి విరిగే విధంగా వ్యవహరిస్తుందని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా చిత్తశుద్ధి ఉంటే రాష్ట్రంలోని యూరియా కొరతను తీర్చి వ్యవసాయ రంగంపై ప్రభుత్వం యొక్క చిత్తశుద్ధిని చాటాలని ధారమోని గణేష్ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి సీనియర్ నాయకులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు అంజయ్య , పార్టీ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి శేఖర్ గౌడ్, తెలంగాణ జాగృతి నాయకులు పెరుమాళ్ళ కృష్ణ,ఆంజనేయులు, నరేందర్ చారి తదితరులు పాల్గొన్నారు.

# స్వయం ఉపాధి శిక్షణతో పాటు సాంకేతిక పరిజ్ఞానంలోను యువత నిష్ణాతులు కావాలి

### శిక్షణ కేంద్రాల్లోనే యువత నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయి.

### యువత సేవా భావం అలవర్చుకోవాలి: ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఆగష్టు 26 జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలోని చిన్న జీయర్ స్వామి ట్రస్ట్ భవనంలో నిరుద్యోగ యువతకు జిఎంఆర్ వరలక్ష్మి, ప్రతిమ ఫౌండేషన్ సంయుక్తంగా అందిస్తున్న ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్, టైలరింగ్, హెూం ఎయిడ్ హెల్త్ కోర్సుల్లో శిక్షణ పూర్తి చేసుకున్న నిరుద్యోగ యువతీ, యువకులకు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ధృవీకరణ పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నిరుద్యోగ యువత కోసం మహారాష్ట్ర మాజీ గవర్నర్ చేన్నమనేని విద్యాసాగర్ రావు, జిఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆశయాలతో స్థాపించిన ఈ భవనంలో జిఎంఆర్ వరలక్ష్మి,ప్రతిమ ఫౌండేషన్ సేవలు అమోఘం అని కొనియాడారు. పలు కోర్సుల్లో శిక్షణ పొందిన నిరుద్యోగ యువత, స్వయం ఉపాధి కోర్సులతోపాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని, నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. హెూం ఎయిడ్ హెల్త్ కోర్స్ యువతులు సేవాభావాన్ని అలవర్చుకుంటూ ఉద్యోగాల్లో స్థిరపడాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి.మనోహర్, చిన్న జీయర్ స్వామి ట్రస్ట్ ఇంచార్జీ ఏ.ఎం.రాజురెడ్డి, జిఎంఆర్ ఫౌండేషన్ ప్రోగ్రాం అధికారి సాయి శ్రీనివాస్, ప్రిన్సిపల్ మహేష్, ప్రతిమ ఫౌండేషన్ ప్రోగ్రాం మేనేజర్ గీతారెడ్డి, ఆర్గనైజర్ నాగిరెడ్డి రఘుపతి, జిఎంఆర్ సిబ్బంది ప్రమోద్, నాగేంధర్, చిరంజీవి, కృష్ణవేణి, వనిత, ఫాక్స్ చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, స్థానిక నాయకులు, యువతీ, యువకులకు పాల్గొన్నారు.



## రవికుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఉచితంగా మట్టి వినాయకులు పంపిణీ...

మియాపూర్ వార్త మిర్రర్ :వినాయక చవితి పర్వదినాన్నీ పురస్కరించుకుని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, శేరిలింగంపల్లి కాంటెస్టెడ్ ఎమ్మెల్యే రవికుమార్ యాదవ్ ఆధ్వర్యంలో రూపొందించిన మట్టి వినాయక ప్రతిమల పంపిణీ చేయడం ప్రశంసనీయమని మియాపూర్ డివిజన్ బిజెపి సీనియర్ నాయకులు గుండె గణేష్ ముదిరాజ్ అన్నారు మంగళవారం రోజు మియాపూర్ డివిజన్ పరిధిలోని వివిధ అపార్ట్ మెంట్ లలో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా గణేష్ ముదిరాజ్ మాట్లాడుతూ మట్టి వినాయకులను పూజించడం ద్వారా పర్యావరణానికి ఎంతో మేలు చేసిన వాళ్ళమవుతామని భవిష్యత్ తరాలు ఆరోగ్యంగా ఉండడానికి కాలుష్య రహిత సమాజాన్ని ఏర్పాటు చేసే బాధ్యత మనందరికీ ఉందని పేర్కొన్నారు. పిఓపి వినాయక విగ్రహాలు వాడటం వల్ల నీటి కాలుష్యం బాగా వ్యాప్తి చెందుతుందని మట్టి విగ్రహాలని అందరూ పూజించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సారా శ్రీను, రాము, కొంచ శివరాజ్ ముదిరాజ్, నరేష్ చారి, వివేక్, నిష్కల్ పాల్గొన్నారు.



## అక్రమంగా నిర్మించిన చర్చిని కూల్చివేయాలి

### ::: వి.హెచ్. పి. గ్రామ కార్యదర్శి కి వినతి

సంస్థాన్ నారాయణపూర్ ఆగస్టు 26 ( వార్త మిర్రర్): నారాయణపురం మండల కేంద్రంలో అక్రమంగా చర్చీ నిర్మించి అన్యమత ప్రచారం చేస్తున్నారు. గ్రామ కంఠానికి చెందిన భూమిలో అక్రమంగా నిర్మాణాలు చేపట్టి వృద్దులకు, వికలాంగులకు బిర్యానీ, వళ్ళు నొప్పులకు నూనెలు, మాత్రలు ఇచ్చి వారితో ప్రార్థనలు చేయిస్తున్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయం నుండి ఇలాంటి అనుమతులు లేకుండా గ్రామ కంఠ భూమిలో నిర్మితమైన క్రైస్తవ పార్దన మందిరాన్ని కూల్చివేయాలి అని సంస్థాన్ నారాయణపురం గ్రామ కార్యదర్శి కి మండల విశ్వహిందు పరిషత్ వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమం లో విశ్వహిందూ పరిషత్ సంస్థాన్ నారాయణపురం మండల ఉపాధ్యక్షులు రాసామళ్ళ ముత్యాలు, ప్రధాన కార్యదర్శి పట్నం బాలకృష్ణ,వి. హెచ్. పి కార్యకర్తలు కిషోర్,మంజునాథ్ రెడ్డి, చెదురువెల్లి సాయి,ఏనుగు శివ, పాలకూర్ల నాగరాజు,బొంగు మధు,కడారి నరేష్, బోయిని కిరణ్, అజయ్,తదితరులు పాల్గొన్నారు



## మట్టి గణపతులనే పూజించాలి

### ::: మాజీ మేయర్ బండ కార్తీక చంద్రారెడ్డి

సికింద్రాబాద్, వార్త మిర్రర్ ఆగస్టు 26.....మట్టి గణపతి విగ్రహ ప్రతిమలను పూజించాలని బిజెపి రాష్ట్ర నాయకురాలు, మాజీ మేయర్ బండ కార్తీక చంద్రారెడ్డి అన్నారు. ఈ మేరకు వినాయక చవితిని పురస్కరించుకుని మంగళవారం తార్నాక చౌరస్తాలోని గణపతి దేవాలయం వద్ద మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్తీక రెడ్డి మాట్లాడుతూ మట్టితో తయారు చేసిన విగ్రహాలను పూజించి పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు మల్లి కంటి వీరన్న, కొన్నే సంపత్, శ్రీనివాస్ చారి, చరణ్, బిక్షపతి, మాడ ప్రమోద్, భూపాల్ రెడ్డి, లడ్డు, సాయి, రాజ్ కుమార్, తిరుమల రాజు, మహిళా నాయకురాలు అనిత, అనూష సరోజ తదితరులున్నారు.



### సంస్థాన్‌లో పర్యావరణ పరిరక్షణకై

## మట్టి గణపతి విగ్రహాల పంపిణీ

### సహస్ర వేదిక్ సేవా సమితి పర్యావరణ హిత మట్టి విగ్రహాల పంపిణీ హర్షణయం: రాసాల యాదయ్య సాగర్

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి : యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో శ్రీ రామలింగేశ్వర దేవాలయ దగ్గర సహస్ర వేదిక్ సేవా సమితి ఆధ్వర్యంలో కళ్లెం విజయ్ రెడ్డి సహకారంతో మట్టి గణపతులను పంపిణీ చేయడం జరిగింది ఈ సందర్భంగా సహస్ర వేదిక్ సేవా సమితి సభ్యులు శ్రవణ్ కుమార్, మాట్లాడుతూ గత 11 సంవత్సరాలుగా మండల కేంద్రంలోని ప్రజలకు పర్యావరణం పై అవగాహన కల్పిస్తూ మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్నామని అందరూ ఈ మట్టి వినాయకుని భక్తి ప్రవృత్తులతో పూజించుకోవాలని కోరారు. రాసాల యాదయ్య సాగర్ మాట్లాడుతూ 11 సంవత్సరాలుగా నారాయణపూర్ మండల కేంద్రంలో పర్యావరణ పరిరక్షణకై సహస్ర వేదిక్ సేవా సమితి మట్టి విగ్రహ ప్రతిమలను పంచడం హర్షణీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో కల్లెట్ల అరుణ్ సాగర్, పగిడిమర్రి కార్తీక్ ఏలే వెంకటేష్ , గొల్లూరు యాదగిరి ,రాసాల యాదయ్య, ఊషయ్య ,రాజు,గంట రమేష్, ఓంకార్, జగన్నాథం, పాలకూర్ల శ్రీనివాస్, చిన్న రాజయ్య, పాఠశాల విద్యార్థులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మట్టి వినాయక విగ్రహాలను పూజించండి పర్యావరణ పరిరక్షణకు పాటుపడండి.

### మున్సిపల్ కమిషనర్.గుత్తా వెంకటరామిరెడ్డి

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి ఆగస్టు 26

లయన్స్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల్ సేవ ఆధ్వర్యంలో సుధా పిల్లల దంత వైద్యశాల డాక్టర్ అవ్వారి శ్రీనివాస ప్రసాద్, డాక్టర్ అవ్వారి నీరజ దేవి సౌజన్యంతో ఉచిత మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం చౌటుప్పల్ మున్సిపల్ ఆఫీస్ ముందు మున్సిపల్ కమిషనర్ పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్ గుత్త వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల్ సేవ ఆధ్వర్యంలో గత తొమ్మిది సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం వందల మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం ద్వారా చౌటుప్పల్ మున్సిపాలిటీలో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా మట్టి వినాయకుడిని పూజించండి పర్యావరణ. పరిరక్షణకు పాటుపడండి అంటూ పిలుపునిచ్చారు.కలర్ వినాయక విగ్రహాల వల్ల చెరువుల్లో నిమజ్జనం చేసినప్పుడు ఆ కలర్స్ నీటిలో కరిగి అనేక జలచర జీవులు మరణిస్తాయని అన్నారు. అదేవిధంగా ప్లాస్టిక్ భూమిలో కరగడానికి వందల సంవత్సరాలు పడుతుందని, అదేవిధంగా భూమ్మీద జీవరాశులకు అనేక రోగాలకు కారణ ము అవుతుందని అన్నారు. కనుక మట్టి వినాయక విగ్రహాలను పూజించి చెరువులు నిమజ్జనం చేయడం వల్ల చెరువుల్లో మట్టి సాంద్రత పెరుగుతుందని చెరువు, నీటిని, జలచరాలను కాపాడిన వాళ్ళం అవుతామని పిలుపునిచ్చారు. లైన్స్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల సేవ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల సేవ అధ్యక్షులు తిరందాస్ జగన్నాథ్, కార్యదర్శి ఎండి హతహర్ పాషా, కోశాధికారి సిలివేరు మంగయ్య, లైన్స్



క్లబ్ జోన్ చైర్మన్ పోలోజు శ్రీనివాస చారి, జిల్లా కమిటీ సభ్యులు గోశిక కరుణాకర్, నాంపల్లి రమేష్, కొసనం రామ్ రెడ్డి, కాసుల వెంకటేశం, బొబ్బిల మురళి, కామిశెట్టి చంద్రశేఖర్, కామిశెట్టి భాస్కర్, వేముల నరసింహ, వనం రాజు, సురోజు సత్యనారాయణ చారి, చింతల ప్రభాకర్ రెడ్డి, దీప అనిల్, పోలోజు రాజు చారి, దాచేపల్లి శ్రీను, సంపూర్ణ చారి, తదితరులు పాల్గొనడం జరిగింది.

## వినాయకుని ప్రతిరూపం ప్రదర్శించిన ట్రినిటీ విద్యార్థులు

### ప్రిన్సిపాల్ ఉజ్జిని మంజుల





వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి ఆగస్టు 26

చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ట్రినిటీ స్కూల్ లో ఈరోజు ముందస్తుగా వినాయక చవితి సంబరాలు ఘనంగా నిర్వహించడం జరిగింది. స్కూల్ విద్యార్థులు వినాయకుని ఆకారంలో కూర్చొని వినాయకుని ప్రతిరూపం ప్రదర్శించారు. స్కూల్ విద్యార్థులు మట్టితో తయారు చేసిన వినాయకుని ప్రతిష్టించి పూజలు ఘనంగా చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఉజ్జిని మంజుల మాట్లాడుతూ విద్యార్థులకు వినాయక పండుగ గురించి వివరించారు. వినాయకుని ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో తయారుచేసిన విగ్రహాలను వాడొద్దని మట్టితో తయారుచేసిన వినాయకులని ప్రతిష్టించి పూజించాలని అన్నారు. వినాయక పండుగ ప్రకృతితో మమేకమైందని వినాయక పత్రిలో వివిధ రకాలైన మొక్కలను వాడతారని అన్నారు. పర్యావరణ సహితంగా వినాయక పండుగ జరుపుకోవాలని ప్లాస్టిక్ ను నిషేధించి జ్యూట్ బ్యాగులని వాడాలని పిల్లలకు వివరించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ కే వి బి కృష్ణారావు,ఉపాధ్యాయులు అనూష, చందన, జ్యోతి రత్న, భార్గవి, సింధు, శిరీష, అనసూయ, లావణ్య, మాలిక్,తదితరులు పాల్గొన్నారు.

## మండలస్థాయి క్రీడా విజేతలకు బహుమతులు అందజేసిన ఎమ్మెల్యే బిఎల్ఆర్





మిర్యాలగూడ , ఆగస్టు 26:-( వార్త మిర్రర్) : క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో రెండు రోజులుగా స్కూల్ గేమ్ ఫెడరేషన్ మిర్యాలగూడ మండల స్థాయి అండర్ 14, 17 బాల,బాలికల క్రీడలు మంగళవారం ముగిశాయి. ఎంఇఓ లావూరి బాలు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బిఎల్ఆర్ విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలలో ప్రావీణ్యం పొందాలని, క్రీడలు మానసిక శారీరక వికాసానికి ఎంతో పెంపొందిస్తాయన్నారు. విద్యార్థులకు బహుమతులను సొంత ఖర్చులతో మిర్యాలగూడ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నూకల వేణుగోపాల్ రెడ్డి బహుకరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధర్మానాయక్, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డి కృష్ణ కాంత్నాయక్, పీడీలు శ్రీనివాస్ రెడ్డి, శోభారాణి, మనోహరి, వెంకటరత్నం, జోజి, బిఎల్ఆర్ బ్రదర్స్ ఆడావత్ అశోక్, నాగునాయక్, అశోక్ చారి తదితరులు పాల్గొన్నారు.



## సహస్ర వేదిక్ సేవ సమితి ఆధ్వర్యంలో మట్టి గణపతిలను పంపిణీ

సంస్థాన్ నారాయణపూర్ ఆగస్టు 26 ( వార్త మిర్రర్): నారాయణపురం మండల కేంద్రంలోని శ్రీరామలింగేశ్వర దేవాలయ దగ్గర సహస్ర వేదిక్ సేవా సమితి ఆధ్వర్యంలో కళ్లెం విజయ్ రెడ్డి సహకారంతో మట్టి గణపతులను పంపిణీ చేయడం జరిగింది ఈ సందర్భంగా సహస్ర వేదిక్ సేవా సమితి ముఖ్యులు కోగూరి శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ గత 11 సంవత్సరాలుగా మండల కేంద్రంలోని ప్రజలకు పర్యావరణం పై అవగాహన కల్పిస్తూ మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్నామని అందరూ ఈ మట్టి వినాయకుని భక్తి ప్రవృత్తులతో పూజించుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో కల్లెట్ల అరుణ్ సాగర్, పగిడిమర్రి కార్తీక్ ఏలే వెంకటేష్ , గొల్లూరు యాదగిరి ,రాసాల యాదయ్య, ఊషయ్య ,రాజు,గంట రమేష్, ఓంకార్, జగన్నాథం, పాలకూర్ల శ్రీనివాస్, చిన్న రాజయ్య, పాఠశాల విద్యార్థులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు. తమ విధేయుత సహస్ర వేదిక్ సేవా సమితి సంస్థాన్ నారాయణపూర్ కోగూరి శ్రవణ్ కుమార్.

## హైదరాబాద్‌లో టాప్ ధనవంతులు వీరే.. ఏయే రంగాల్లో..

గత కొన్ని దశాబ్దాలుగా బిజినెస్ రంగంలో వేగంగా దూసుకుపోతున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతూ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోంది. ఇప్పుడు ఒక బిజినెస్ హబ్‌గా మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఈ భాగ్యనగరం ప్రత్యేకించి..ప్రపంచ వ్యాప్తంగా ఎంతో మంది ధనవంతులున్నారు. అలాగే మన దేశంలో కూడా చాలా మంది ధనవంతులున్నారు. వారి వ్యాపారంతో దినదినాభివృద్ధి చెందుతున్నారు. ఇక హైదరాబాద్ విషయానికొస్తే ఇక్కడ కూడా ధనవంతులు భారీగా ఉన్నారు. వివిధ రంగాల్లో వ్యాపారాలను అభివృద్ధి చేసుకుంటూ మరింత సంపాదన వెనుకేసుకొస్తున్నారు. గత కొన్ని దశాబ్దాలుగా బిజినెస్ రంగంలో వేగంగా దూసుకుపోతున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతూ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోంది. ఇప్పుడు ఒక బిజినెస్ హబ్‌గా మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఈ భాగ్యనగరం ప్రత్యేకించి ఫార్మాస్యూటికల్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్ వంటి రంగాలలో తన ముద్రను వేస్తూ ఎంతో మంది బిలియనీర్లుగా తీర్చిదిద్దుతోంది. హైదరాబాద్ నగరం వ్యాపారాలకు నిలయంగా మారింది. హైదరాబాద్ ఎంతో మందికి ఉపాధి కల్పిస్తోంది.ఇది కూడా చదవండి: పండగకు ముందు షాకిచ్చిన బంగారం ధరలు.. తులంపై భారీగా పెంపు!మొదటగా దివిస్ లాబొరేటరీస్ వ్యవస్థాపకుడు మురళి దివి. ఈ పేరు తప్పక ప్రస్తావించాలి. ఆయన నికర విలువ ప్రస్తుతం 9.2 బిలియన్ల అమెరికన్ డాలర్లు. దివిస్ లాబొరేటరీస్ ప్రపంచవ్యాప్తంగా క్రియాశీల ఔషధ పదార్థాలు సరఫరా చేసే అగ్రశ్రేణి కంపెనీలలో ఒకటిగా నిలిచింది.



## రూరల్ పోలీస్ స్టేషన్ను వార్షిక తనిఖీ చేసిన డి.ఎస్.పి రాజశేఖర్ రాజు

మిర్యాలగూడ ,ఆగస్టు 26:- (వార్త మిర్రర్) మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్ ను మిర్యాలగూడ డిఎస్పీ కె. రాజశేఖర్ రాజు మంగళవారం సందర్శించి వార్షిక తనిఖీ నిర్వహించారు. తనిఖీలో భాగంగా సిబ్బంది పరేడ్, కిట్ బాక్స్, సిబ్బంది స్మాల్ సర్వీస్ బుక్, స్టేషన్ భవనం, అన్ని స్టేషన్ రికార్డులు,కేస్ ఫైళ్లను తనిఖీ చేసి తగు సూచనలు ఇచ్చారు.అదేవిధంగా గణేష్ పండుగ, రాబోయే ఎన్నికల బందోబస్తు విధివిధానాలు, పోలీసు సిబ్బంది ఆరోగ్యం సంరక్షణ, సమస్యల గురించి తగు సూచనలను ఇచ్చారు. స్టేషన్ ఆవరణలోమొక్కలు నాటారు. కార్యక్రమంలో సీఐ పిఎన్డి ప్రసాద్, ఎస్ఐలు ఎం. లక్ష్మయ్య, వెంకటేశ్వర్లు, ఎఎస్ఐ రాములునాయక్ పాల్గొన్నారు.

## ఈ స్కీమ్‌లో డిపాజిట్ చేస్తే చేతికి రూ.40 లక్షలు.. పోస్టాఫీసులో అద్భుమైన స్కీమ్

ఈ పథకం కింద ఏదైనా పోస్టాఫీసు లేదా బ్యాంకులో ఖాతాను తెరవవచ్చు. ఇది పెట్టుబడిపై రుణ సౌకర్యాన్ని కూడా అందిస్తుంది. అలాగే ప్రారంభ పెట్టుబడి పెట్టిన ఆర్థిక సంవత్సరం ముగిసిన తర్వాత రుణం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఇది మాత్రమే కాదు, ఖాతా తెరిచిన ఐదు సంవత్సరాల తర్వాత..ప్రతి ఒక్కరూ తమ ఆదాయంలో కొంత భాగాన్ని తమ డబ్బు సురక్షితంగా ఉండే, మంచి రాబడిని పొందే ప్రదేశంలో పెట్టుబడి పెట్టాలని కోరుకుంటారు. ఈ సందర్భంలో పోస్ట్ ఆఫీస్ నిర్వహించే అన్ని పథకాలు బాగా ప్రాచుర్యం పొందాయి. అలాగే భారీ రాబడిని ఇస్తాయి. అలాంటి ఒక పథకం పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ ఇది తక్కువ-రిస్క్ పన్ను-రహిత పెట్టుబడి రాబడిని కోరుకునే పెట్టుబడిదారులలో అత్యంత ప్రజాదరణ పొందింది. ఇది పెట్టుబడిపై 7 శాతం కంటే ఎక్కువ వడ్డీని ఇస్తుండగా, సాధారణ పెట్టుబడి ద్వారా కూడా భారీ నిధిని సేకరిస్తారు.